# కులం పేరుతో విగ్రహ ఏర్పాటును అడ్డుకుంటే ఉద్యమిస్తాం

❖ *నాయి బ్రహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాచమల్ల బాలకృష్ణ*




**దశ, అబ్దుల్లాపూర్‌మెట్:** కులం పేరుతో విగ్రహ ఏర్పాటును అడ్డుకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని నాయి బ్రహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాచమల్ల బాలకృష్ణ అన్నారు. మండల పరిధి బండరావిరాల గ్రామానికి చెందిన కీ.శే. గుండోజి రంగదాసు పంతులు విగ్రహం గ్రామంలో ఏర్పాటు చేయబోతే అదే గ్రామానికి చెందిన కొంత మంది అడుకుంటున్నారని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మంగళవారం అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ లో నాయి బ్రహ్మణ సంఘం రాష్ట్ర నాయకులు ఫిర్యాదు చేశారు. అనంతరం రాచమల్ల బాలకృష్ణ మాట్లాడుతూ..“కుల వివక్షను సహించేది లేదని” అవసరమైతే రాష్ట్ర స్థాయిలో ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమించి.. నాయి బ్రాహ్మణుల ఐక్యత, బలమేంటో చూపిస్తామని హెచ్చరించారు. గుండోజి రంగదాసు పంతులు విగ్రహం ఏర్పాటు జరిగే వరకు మా పోరాటం కొనసాగుతుందని బాలకృష్ణ స్పష్టం చేశారు. కులం, వృత్తిని కించపరిచేలా చేసిన వ్యాఖ్యలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెంబర్తి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు ఆర్. జయసింహ, సహాయ కార్యదర్శులు మెగిలి రఘు, కంది సత్యం, ప్రచార కార్యదర్శి దుబాయ్ నర్సింగ్, రాష్ట్ర వృత్తిదారుల సంఘం అధ్యక్షులు చెన్నారం మల్లేశం, మండల అధ్యక్షులు రంగయ్య, సభ్యులు దాసారం రవి, లంగారి శ్రీను, మల్లేష్, అనిల్, గుండాల రాజారాం తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు అండగా సీఎం ఆర్ఎఫ్ పథకం

❖ *చెక్కుల పంపిణీ కార్యక్రమంలో టూరిజం బోర్డ్ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి వెల్లడి*




**దశ, సూర్యాపేట ప్రతినిధి:** ఆర్థిక ఇబ్బందులతో ఖరీదైన వైద్య చికిత్స చేయించుకోలేని పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎం ఆర్ఎఫ్) పథకం అండగా నిలుస్తోందని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న పేద కుటుంబాలకు సీఎం ఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందించి, వారికి మెరుగైన వైద్యం పొందే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. సూర్యాపేట నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 21 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.7,93,000 విలువైన సీఎం ఆర్ఎఫ్ చెక్కులను పటేల్ రమేష్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలు వైద్య ఖర్చుల కోసం ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం సీఎం ఆర్ఎఫ్ ద్వారా సహాయం అందిస్తోందన్నారు. అవసరమైన వైద్య చికిత్సకు ఈ ఆర్థిక సహాయం ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెలుగు వెంకన్న, కౌన్సిలర్లు జ్యోతి కరుణాకర్, బైరబోయిన శ్రీనివాస్, పిల్లల రమేష్ నాయుడు, పాలగాని కృష్ణ, కాంగ్రెస్ నాయకులు సైదిరెడ్డి, తండు శ్రీనివాస్, వల్దాసు దేవేందర్, పాలకుర్తి వెంకటేష్, దొంతిరెడ్డి సైదిరెడ్డి, ధర్మానాయక్ తదితరులు పాల్గొన్నారు.

# గుడుంబా తయారీపై ఎక్సైజ్ దాడులు

**దశ, హైదరాబాద్:** ఎల్లారెడ్డిపేట మండలంలోని పలు తండాల్లో అక్రమంగా గుడుంబా తయారు చేసి విక్రయిస్తున్నారన్న సమాచారంతో ఎక్సైజ్ అధికారులు మంగళవారం తనిఖీలు చేపట్టారు. ఆల్మాస్‌పూర్, గుంటపల్లి చెరువు, కిస్తునాయక్, అక్కపల్లి తండాల్లో బృందాలు విస్తృతంగా తనిఖీలు నిర్వహించాయి.ఆల్మాస్‌పూర్ తండాలో గుడుంబా తయారు చేస్తున్న ఇద్దరిని అధికారులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వారిపై రెండు కేసులు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి 6 లీటర్ల అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. గుడుంబా తయారీకి సిద్ధంగా ఉంచిన సుమారు 100 లీటర్ల బెల్లం పులుపు (ఎఫ్‌జే వాష్)ను ధ్వంసం చేశారు. మండలంలోని తండాల్లో అక్రమ మద్యం తయారీ, విక్రయాలపై నిరంతరం నిఘా కొనసాగుతుందని ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

# ఢిల్లీలో గర్జించిన.. సింగాపురం ముద్దుబిడ్డ "రాజన్న దొర"




**దశ, హుజురాబాద్ (పడాల రమేష్)**

నేడు సింగాపురం ముద్దుబిడ్డ, మాజీ ఎంపీ దివంగత వొడితల రాజేశ్వరరావు 95వ జయంతి జరగనుంది. 1931 సెప్టెంబర్ 16న ఆయన జన్మించారు. సింగాపురంలో జన్మించిన ఆయన సర్పంచ్ గా, పంచాయతీ సమితి అధ్యక్షునిగా, ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా, ఎంపీగా, పనిచేశారు. నాటి ప్రధానమంత్రి పీవీ నరసింహారావుకు అంతరంగి కుడిగా, రాజకీయ సలహాదారుగా ఉన్నారు. పీవీ నరసింహారావు రామ్ టెక్లో, నంద్యాలలో, బరంపురంలో, హనుమకొండలో, మంథనిలో పోటీ చేసిన సందర్భంగా అక్కడి ప్రచార బాధ్యతలను రాజేశ్వరరావు నిర్వహించారు. పీవీ పదవులు అనుభవించినప్పుడు పదవిలో లేనప్పుడు కూడా రాజేశ్వరరావు అండగా ఉన్నారు. రాజేశ్వరరావు సోదరుడు లక్ష్మీకాంతరావు కూడా బి ఆర్ ఎస్ లో చేరి రాజ్యసభ సభ్యుడు అయ్యారు.

అలాగే లక్ష్మీకాంత రావు కుమారుడు సతీష్ కుమార్ హుస్నాబాద్ ఎమ్మెల్యే అయ్యారు. ప్రస్తుతం ఆయన మనవడు వొడితల ప్రణవ్ హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జిగా చురుకుగా పనిచేస్తున్నారు. పీవీ ప్రధానిగా ఉన్న కాలనీలో రాజేశ్వరరావు మాటే చెల్లుబాటు అయ్యేది. ఆయన నేరుగా పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో మాట్లాడేవారు. అలాగే నేదురుమల్లి జనార్ధన్ రెడ్డిని మార్చి కోట్ల విజయభాస్కర్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేయడంలో సింగాపురం రాజేశ్వరరావు కీలక భూమిక పోషించారు. అయితే 1989 ఎన్నికల్లో కేతిరి సాయి రెడ్డి చేతిలో రాజేశ్వరరావు ఓటమి చెందారు. లేకుంటే ఆయన ఉమ్మడి రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయ్యేవారు అన్న వాదనలు కూడా ఉన్నాయి. అలాగే ఆయన పలు విద్యాసంస్థలను కూడా నెలకొల్పారు. స్వగ్రామమైన సింగాపురంలో కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలను, అలాగే రామ్ టెక్ లోను, హనుమకొండ లోను కిట్స్ పేరుతో ఇంజనీరింగ్ కళాశాలలను స్థాపించారు. వరంగల్ పబ్లిక్ స్కూల్ విజేత పబ్లిక్ స్కూల్ వంటి వాటిని కూడా స్థాపించి మంచి విద్యాసంస్థలుగా తీర్చిదిద్దారు. నేడు రాజేశ్వరరావు జయంతి సందర్భంగా ఆయన సేవలను, రాజకీయ ప్రస్థానాన్ని పలువురు గుర్తు చేసుకుంటున్నారు. నేడు ఆయన మనవడు వొడితల ప్రణవ్ హుజురాబాద్ లో రాజేశ్వరరావు విగ్రహం వద్ద నివాళులు అర్పించానున్నారు.

# ప్రభుత్వ శ్మశాన వాటిక స్నానపు గదుల కూల్చివేత

❖ *అనుమతి లేకుండా జేసీబీతో కూల్చివేతకు యత్నం.. పోలీసులకు పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు.*




**దశ, అబ్దుల్లాపూర్‌మెట్:** రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం ఇనాంగూడ గ్రామంలో ప్రభుత్వ శ్మశాన వాటికలోని స్నానపు గదుల కూల్చివేత వివాదంగా మారింది. ఎలాంటి అనుమతులు లేకుండా జేసీబీతో ప్రభుత్వ ఆస్తిని కూల్చివేశారంటూ గ్రామపంచాయతీ కార్యదర్శి రామకృష్ణారెడ్డి అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పంచాయతీ కార్యదర్శి, స్థానికుల కథనం ప్రకారం.. ఇనాం గూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల సమీపంలోని శ్మశాన వాటికలో ప్రజల సౌకర్యార్థం నిర్మించిన స్నానపు గదులను గ్రామస్థులు వినియోగిస్తున్నారు. 13న ఉదయం సుమారు 10.30 గంటలకు స్థానికులు గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు స్నానపు గదులను కూల్చివేస్తున్నారని సమాచారం ఇచ్చినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. గ్రామస్థులు సంఘటనా స్థలానికి చేరుకుని కూల్చివేతను అడ్డుకున్నారని, ఈ ఘటనకు అబ్బూరి సాయి, అతనితో పాటు మరో వ్యక్తి పాల్పడినట్లు సమాచారం అందిందని కార్యదర్శి తెలిపారు.

అనంతరం తాను విధులకు హాజరై పరిశీలించగా శ్మశాన వాటికలోని స్నానపు గదులు పూర్తిగా కూల్చివేయబడి ఉన్నట్లు గుర్తించినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ ఆస్తిని ఎలాంటి అనుమతులు లేకుండా ధ్వంసం చేసిన వారిపై విచారణ జరిపి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కార్యదర్శి పోలీసులను కోరారు. ఘటనపై పోలీసులు విచారణ చేపట్టినట్లు సమాచారం.

# కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తాం

❖ *నూతనంగా ఎన్నికైన అధ్యక్షుల వెల్లడి*
❖ *నియామక పత్రాలు అందజేసిన జిల్లా అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి*



**దశ, అబ్దుల్లాపూర్‌మెట్:** కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామని నూతనంగా ఎన్నికైన పార్టీ అధ్యక్షులు తెలిపారు.

పార్టీ తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుని ప్రజల్లో పార్టీకి మరింత ఆదరణ తీసుకువచ్చేలా పనిచేస్తామని పేర్కొన్నారు. ఈ మధ్యకాలంలో ఎన్నికైన అధ్యక్షులకు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నల్లా నర్సింహారెడ్డి, స్థానిక ఎమ్మెల్యే చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేశారు.

ఈ సందర్భంగా చల్లా నర్సింహారెడ్డి మాట్లాడుతూ... పార్టీ సంస్థాగత బలోపేతానికి నూతనంగా నియమితులైన అధ్యక్షులు కీలకంగా పనిచేయాలని సూచించారు. గ్రామ, మండల స్థాయిలో కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. అదే విధంగా ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటు స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని నర్సింహారెడ్డి సూచించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేస్తున్న కార్యకర్తలకు అండగా ఉంటూ, ప్రతి ఒక్కరినీ కలుపుకొని ముందుకు సాగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్లాపూర్‌మెట్ మండల అధ్యక్షులు బింగి దేవదాస్, పెద్ద అంబర్ పేట్ డివిజన్ పండుగల రాజు, కుంట్లూరు డివిజన్ అధ్యక్షులు భాస్కర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

# గణేష్ మండపాల వద్ద డ్రగ్స్‌పై అవగాహన




**దశ, హయత్‌నగర్:** గణేష్ ఉత్సవాలు-2026 సందర్భంగా మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ సీపీ బి. సుమతి ఆదేశాల మేరకు హయత్‌నగర్ పోలీసుల ఆధ్వర్యంలో గణేష్ మండపాల వద్ద డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హయత్‌నగర్ SHO CH. శంకరయ్య, EAGLE టీమ్ ఇన్‌స్పెక్టర్ రాము, SIలు డి. కృష్ణయ్య, కె. అరుణ్ కుమార్, పోలీస్ సిబ్బంది, సహచరి సిబ్బందితో కలిసి పెద్ద అంబర్‌పేట్ గ్రామం, కుంట్లూరు శివాలయం రోడ్ పరిసరాల్లోని గణేష్ మండపాలను సందర్శించారు. ఈ సందర్భంగా డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాల వల్ల కలిగే ఆరోగ్య, మానసిక, సామాజిక దుష్ప్రభావాలను భక్తులు, యువత, మండపాల నిర్వాహకులకు వివరించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. అలాగే మండపాల వద్ద విద్యుత్, అగ్ని ప్రమాదాల నివారణ, జనసందోహం నియంత్రణ, పార్కింగ్ తదితర భద్రతా చర్యలు పాటించాలని నిర్వాహకులకు సూచించారు. గణేష్ పూజా కార్యక్రమాలు, నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా పోలీసులకు సహకరించాలని భక్తులు, నిర్వాహకులు, ప్రజలను పోలీసులు కోరారు.